క్లుప్తంగా

మీసాల శ్రీమన్నారాయణుడు..



కోడూరు: ఉల్లిపాలెం శ్రీమన్నారాయణుడు సరికొత్త రూపంలో భక్తులకు దర్శనమిచ్చాడు. భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఆదివారం గర్భాలయంలోని శ్రీమన్నారాయణ స్వామి 11 అడుగుల ఏక శిలా మూలమూర్తికి మీసాల ధరింపజేసి అలంకరించారు. దీపకాంతుల నడుమ స్వామివారి నిజరూప దర్శనం చేసుకొని భక్తులు మంత్ర ముగ్ధులయ్యారు.

ఆర్థికాభ్యున్నతితో సమస్యల పరిష్కారం



మచిలీపట్నంటౌన్: ఆర్థిక స్వాతంత్ర్యంతో అన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఇండికేటర్ క్రియేటర్ మదిరి రాంబాబు అన్నారు. దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణా జిల్లా శాఖ ఆధ్వర్యాన ఆదివారం చిత్ర కళా సంసద్ భవనంలో షేర్ మార్కెట్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికి పరిపుష్టికి ప్రతి ఒక్కరూ అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో దళిత జాయింట్ యాక్షన్ కమిటీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు జక్కుల ఆనందబాబు(జానీ), జేఏసీ నాయకులు భూపతి అంబేడ్కర్, మత్తే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాన కోటయ్యకు పూర్వవిద్యార్థుల నివాళి



పెడన: పట్టణంలోని భట్ట జ్ఞానకోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1977–78లో పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆ స్కూల్‌ను సందర్శించారు. పాఠశాలకు స్థలాన్ని ఇచ్చిన దాత భట్ట జ్ఞాన కోటయ్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. హెచ్‌ఎం అశోక్‌కుమార్, విద్యాశాఖ ఇంటర్ విశ్రాంత అధికారి మట్టా రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

కోడూరు: హంసలదీవి వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు, పాలకాయతిప్ప బీచ్ వద్ద సింధు స్నానాల నేపథ్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా నిర్వహించారు. ఆదివారం హంసలదీవి నుంచి పాలకాయతిప్ప వరకు రోడ్డుకి రువైపులా జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఎంపీడీఓ సుధాప్రవీణ్, ఈఓపీఆర్డీ నాగరేవతి, కార్యదర్శి లీలాప్రియాంక పర్యవేక్షించారు.

సాగరతీరంలో పర్యాటకుల కోలాహలం

కోడూరు: హంసలదీవి సాగరతీరం పర్యాటకులతో కళకళలాడింది. ఆదివారం సెలవుదినం కావడంతో సుదూర ప్రాంతాలకు చెందిన యాత్రికులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి పెద్దసంఖ్యలో తరలివచ్చారు. హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ పర్యాటకులు తీరంలో సందడి చేశారు. పాలకాయతిప్ప మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐలు ఉజ్వల్, పూర్ణ మాధురి పర్యవేక్షణలో సిబ్బంది గస్తీ నిర్వహించారు. పర్యాటకులకు జాగ్రత్తలు చెబుతూ అవగాహన కల్పించారు.

కరపత్రాల ఆవిష్కరణ

వెంకటాపురం(మోపిదేవి): టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 21వ తేదీ వరకు ధార్మిక ప్రచార కార్యక్రమాలు చేపట్టినట్లు ధర్మ ప్రచారక్ గరికిపాటి వీరంజనేయులు తెలిపారు. అందులో భాగంగా మండలంలోని వెంకటాపురం రామాలయం వద్ద ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు లింగం బసవశంకరరావు, మండల అధ్యక్షుడు అరజా ఏడుకొండలు, రామాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు నారగం కృష్ణ, కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన మరో కారు

మోపిదేవి: జాతీయ రహదారి 216పై తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఆదివారం అవనిగడ్డ నుంచి చల్లపల్లి వైపు కారు వెళ్తోంది. ఇది ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు ముందు భాగం బాగా దెబ్బతింది. స్థానిక ఎస్ విహార్ హోటల్ వద్ద జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారుకు ద్విచక్రవాహనం అడ్డుగా రావడంతో కారు సడన్ బ్రేక్ వేసి నిలిపివేశారు. అప్పటికే వేగంగా వెనకే వస్తున్న కారు ఆగి ఉన్న కారును ఢీ కొనడంతో ఘటన జరిగిందని స్థానికులు తెలిపారు.

పార్కుల నిర్వహణ అధ్వానం

- గత ప్రభుత్వం అభివృద్ధి చేసినా ప్రస్తుతం నిర్వహించని పరిస్థితి
- పార్కు స్థలాలు కబ్జా అవుతున్నా పట్టించుకోని వైనం
- నిర్వహణ లేక వెలవెల



బందరు హిందూ కళాశాల వెనుక పార్కు వద్ద ధ్వంసమైన సిమెంట్ ట్రీగార్డులు

మచిలీపట్నంటౌన్: ఆహ్లాదాన్ని, ఆనందాన్ని పంచే పార్కులకు నిర్వహణ లేకపోవడంతో వెలవెలబోతున్నాయి. బందరులో కళావిహీనంగా మారిన పార్కుల్లో సందర్శకులు కానరావడం లేదు. పట్టించుకునే వారు లేకపోవడంతో మొక్కలు ఎండిపోయి కనిపిస్తున్నాయి. నగరంలో చిన్నా చితకా కలిపి 50కి పైగా పార్కులు, పార్కు స్థలాలు ఉన్నాయి. వీటి నిర్వహణ, అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించింది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత అధికారులు ఆయా పార్కుల నిర్వహణను గాలికొదిలేశారు.

అభివృద్ధి చేసినా నిరుపయోగమే

నగరంలోని 13వ డివిజన్‌లో హిందూకళాశాల వెనుక పార్కు స్థలం మురుగు గుంతగా మారి దోమలు వృద్ధి చెందుతున్నాయి. గత ప్రభుత్వం పార్కు లోపల, బయట గ్రీనరీని అభివృద్ధి చేసింది. ఇలాంటి పార్కు నిర్వహణను అధికారులు పూర్తిగా మర్చిపోయారు. ఇక్కడ సిమెంట్ బెంచ్‌లు పగిలిపోయాయి. మొక్కలు నామరూపాలు లేకుండా పోయాయి. ట్రీగార్డులు ధ్వంసమయ్యాయి. ఈ పార్కులో ప్రస్తుతం గేదెలు సంచరిస్తూ బందెల దొడ్డిలా దర్శనమిస్తోంది. నోబుల్ కాలనీలో పార్కు స్థలంలోనూ ఉద్యానవనాన్ని అభివృద్ధి చేశారు. ఈ పార్కు నిర్వహణ అంతంత మాత్రంగానే ఉంది.



సందర్శకులు కరవైన హిందూ కళాశాల వెనుక పార్కు

ప్రధాన పార్కు మినహా మిగిలిన పార్కులపై నిర్లక్ష్యం

నగరంలోని ప్రధాన రహదారిలో ఉన్న పార్కు మినహా అభివృద్ధి చేసిన మిగిలిన ఉద్యానాల నిర్వహణ గాల్లో దీపంలా మారింది. ప్రధాన పార్కులో సైతం పలు సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. నగరంలోని హౌసింగ్‌బోర్డు, పాత రైల్వే స్టేషన్ వద్ద ఉన్న పైలాన్‌పార్కు, ఆశీర్వాదపురం, సెయింట్ ఫ్రాన్సిస్ హైస్కూల్ ముందున్న కేవీఆర్ పార్కు, ఎల్ఐసీ కార్యాలయ ప్రక్కరోడ్డులో, డీఈఓ కార్యాలయం ఎదురుగా, శిడింబీ అగ్రహారం, పంచాయతీరాజ్ కాలనీల్లో అభివృద్ధి చెందిన పార్కులకు ఆలనా పాలనా లేక ప్రజలకు ఆహ్లాదాన్ని అందించలేకపోతున్నాయి. ఇక్కడ సమస్యలున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

కబ్జా అవుతున్నా పట్టించుకునేవారే లేరు

నగరంలో పలు కాలనీల్లో పార్కులకు కేటాయించిన స్థలాలు కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించకోవటంలేదు. విలువైన పార్కు స్థలాలు కొన్ని ఆక్రమణలకు గురవ్వగా మరి కొన్ని ఖాళీగానే ఉన్నాయి. వీటి పరిరక్షణకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఆయా స్థలాలపై పలువురి ఆక్రమణదారుల కన్ను పడుతోంది. నగరంలోని 49వ డివిజన్‌లోని కృష్ణవేణి ఐటీఐ కళాశాల ఎదురుగా ఉన్న వెంచర్‌లో పార్కుకు కేటాయించిన 50 సెంట్ల స్థలం కబ్జాకు గురైంది. దానిలో పక్కా భవనాలు సైతం వెలిసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. 50వ డివిజన్ మందులగూడెంలో పార్కు స్థలం దశల వారీగా పూర్తిగా ఆక్రమణలకు గురైంది. డ్రైవర్స్‌కాలనీ, గుమస్తాల కాలనీ ఇలా పలు కాలనీల్లో పార్కు స్థలాలు ప్రస్తుతం ఖాళీగానే ఉన్నాయి. మున్సిపల్ అనుమతి పొందిన పలు వెంచర్లలో పార్కు స్థలాలను మినహాయించారు. ఈ స్థలాలను స్వాధీనం చేసుకుని వీటిని పరిరక్షించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

కన్యకాపరమేశ్వరికి ప్రత్యేక పూజలు



పెడన: పట్టణంలోని శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో వాసవి మాతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. 108 మంది దంపతులతో 108 కిలోల కుంకుమ, 108 కిలోల పసుపుతో అమ్మవారికి కుంకుమార్చన ప్రక్రియను ఆలయ ప్రధాన అర్చకుడు సాయిబాబు చేశారు. తొలుత 108 మంది దంపతులు ఆలయం నుంచి ప్రధాన రహదారి వెంట బస్టాండు సెంటరు వరకు వాయిద్య మేళాలతో ఊరేగింపు నిర్వహించి తిరిగి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి చిన్నా, ఆలయ అభివృద్ధి కమిటీ, ఆయా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



చల్లపల్లి: వాసవీ క్లబ్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 30 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వాసవీ క్లబ్ చల్లపల్లి శాఖ అధ్యక్షుడు మాజేటి అమరవాణి తెలిపారు.

స్థానిక వాసవీ క్లబ్ ఆవరణలో విస్సంశెట్టి హరినారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు రామహరీష్ కుటుంబ సభ్యుల సహకారంతో ఆదివారం ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో మొత్తం 60 మందికి పరీక్షలు నిర్వహించినట్లు చెప్పారు. అవనిగడ్డకు చెందిన కంటి వైద్యుడు బి.మోహనరావు పరీక్షలు చేసి అవసరమైన వారిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. శిబిరంలో క్లబ్ చల్లపల్లి శాఖ ప్రధాన కార్యదర్శి గోళ్ళ వెంకటరత్నం, కోశాధికారి జూపూడి కిరణ్, సభ్యులు దింటకుర్తి జ్యోతి, మలిశెట్టి చెంచు రామయ్య, వరదా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత కార్మికుడికి ఆర్థిక సాయం

పురిటిగడ్డ(చల్లపల్లి): అనారోగ్యంతో బాధపడుతున్న చేనేత కార్మికుడికి వైద్య ఖర్చుల నిమిత్తం రావెళ్ల ఫౌండేషన్ ఆదివారం ఆర్థిక సాయం అందజేసింది. చల్లపల్లి మండల పరిధిలోని పురిటిగడ్డ చేనేత కాలనీకి చెందిన తిరువీధుల పరుశురామ్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న రావెళ్ల ఫౌండేషన్ చైర్మన్ ఉదయ్ రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ నిడమానూరి దిలీప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యురాలు రాజులపాటి అంకమ్మ, మాజీ సర్పంచ్ పరుచూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మపురం చౌడేశ్వరిదేవి ఆలయం ముస్తాబు



బ్రహ్మపురంలోని జ్యోతిర్మహోత్సవాలకు ముస్తాబైన చలువ పందిళ్లు



విద్యుత్‌దీపాలంకరణలో చౌడేశ్వరి దేవి

పెడన: చౌడేశ్వరి దేవి జ్యోతిర్మహోత్సవాలు ఈనెల 10వ తేదీ రాత్రి నుంచి 13వ తేదీ వరకు పట్టణంలోని బ్రహ్మపురంలోని శ్రీరామలింగ చౌడేశ్వరి దేవి భజన గుడి వద్ద ప్రారంభం కానున్నాయి. దేవాంగ సామాజిక వర్గం కులదేవత అయిన చౌడేశ్వరి దేవి అమ్మవారి ఈ ఉత్సవాలు 16 ఏళ్ల క్రితం ఇక్కడ నిర్వహించారు. ఇప్పుడు ఉత్సవం చేయడానికి యువత, కమిటీ సభ్యులు అడుగులు ముందుకేశారు. ఉత్సవాలకు పెడన నుంచే కాకుండా వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాల్లోని దేవాంగ కులస్తులు భారీగా తరలిరానున్నారు. అనపూజతో ఉత్సవాలను ప్రారంభించి నగరోత్సవంతో ముగుస్తుంది.

నేటి నుంచి 13 వరకు జ్యోతిర్మహోత్సవాలు

12, 13 తేదీల్లో భారీ అన్నసమారాధన జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

- జ్యోతిర్మహోత్సవాలపై మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా ఆదివారం ఆరా తీశారు. ఆయన బ్రహ్మపురంలోని భజనగుడి వద్దకు చేరుకుని ఉత్సవ కమిటీ వారితో మాట్లాడారు. ఉత్సవ సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా శాఖాపరమైన బందోబస్తు ఉంటుందని కమిటీ వారికి తెలిపారు. డీఎస్పీతో పాటు పెడన ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

అగ్నిప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తి నష్టం

బంటుమిల్లి: సాతులూరులో ఆదివారం జరిగిన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండునిట్లాళ్ల తాటాకు పాక బుగ్గిపాలు కాగా రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగింది. గ్రామానికి చెందిన మద్దిబోయిన సత్యనారాయణ వ్యవసాయం కూలి పనులు చేసుకుంటూ మూడు ఎకరాలు పొలం కౌలు చేస్తున్నాడు. ఇటీవల ధాన్యం అమ్మగా వచ్చిన డబ్బులను అప్పు తీర్చడానికి తీసుకువచ్చి ఇంట్లో పెట్టాడు. విజయవాడలో చిరుద్యోగం చేస్తున్న కుమారుడిని ఆదివారం ఇంటికి వచ్చి అప్పులు సరిపెట్టాలని కోరాడు.

వంట పనులు పూర్తి చేసుకుని కుమారుడు వచ్చిన తర్వాత కలిసి భోజనం చేద్దామని అతని కోసం సత్యనారాయణ దంపతులు ఎదురుచూస్తూ టీవీ చూస్తున్నారు. ఈ క్రమంలో సర్వీసు వైరు వద్ద షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఇంటిపై కప్పు మంటలు రాజుకుని ఎగిసిపడ్డాయి. వీధిలో వెళ్తున్న స్థానికులు గమనించి కేకలు వేయడంతో సత్యనారాయణ దంపతులు బయటకు వచ్చారు. వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటంతో తాటాకుపాకను మంటలు చుట్టుముట్టాయి.



అగ్నిప్రమాదం జరిగిన పాక

గ్రామస్తులు గ్యాస్ సిలిండర్‌ను బయటకు తెచ్చి బంటుమిల్లి అగ్నిమాపకశాఖ సిబ్బందికి సమాచారం తెలిపారు. గ్రామస్తుల సహకారంతో అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.3లక్షలు ఆస్తినష్టం జరిగినట్లుగా అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు. సర్పంచ్ బాలఏసు, మాజీ సర్పంచ్ రాధాకృష్ణ, మురళీకృష్ణ, గ్రామస్థులు కరుణకుమార్ తదితరులు కట్టుబట్టలతో మిగిలిన సత్యనారాయణ దంపతులకు సానుభూతి తెలిపి సాయం చేసేందుకు ముందుకు వచ్చారు.

జలధీశ్వరుడి సన్నిధిలో బీఎస్ఎన్ఎల్ ఏపీ సీజీఎం



ఘంటసాల: మండలంలోని చారిత్రాత్మక ఆలయాలు, బౌద్ధ స్తూపాన్ని సందర్శించడం ఆనందంగా ఉందని బీఎస్ఎన్ఎల్ ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం అన్నారు. ఘంటసాలలో శ్రీ బాలపార్వతీ సమేత శ్రీ జలధీశ్వర స్వామి వారిని బీఎస్ఎన్ఎల్ ఏపీ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రాంగణంలోని ఆలయ శాసనాన్ని పరిశీలించి ఈ దేవాలయం చరిత్రకు నిలువెత్తు నిదర్శనమన్నారు. అగస్త్య మందిరం చూసి ఈ దేవాలయ ప్రతిష్ఠాపకులు అగస్త్యులు విగ్రహ ప్రతిష్ఠ చేయడం విశేషమన్నారు. దేవాలయం తరపున శేషాచలం దంపతులను జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం అందించి సత్కరించారు. అనంతరం శ్రీకాకుళేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎన్ఎస్ ఎస్డీఈ ఎస్.ఆంజనేయులు, జేటీవో డి.రామకృష్ణ, జేఈ బి.వెంకటరమణ, టీటీ పి.బసవపున్నయ్య పాల్గొన్నారు.

23న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

చల్లపల్లి: శ్రీమంతు రాజా యార్లగడ్డ శివరామప్రసాద్(ఎస్ఆర్‌వైఎస్‌పీ) కళాశాలలో చదువుకున్న 1932–2024 బ్యాచ్‌లకు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళన కార్యక్రమాన్ని ఐక్యంగా విజయవంతం చేద్దామని ఎన్ఆర్ఐ మండవ శేషగిరిరావు కోరారు. ఆదివారం కళాశాల ప్రాంగణంతో శేషగిరిరావు ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 23వ తేదీన జరగనున్న కార్యక్రమానికి ఎంతమంది వస్తారూ... ఏర్పాట్లు ఎలా.. చేయాలి అనే అంశాలపై చర్చించారు. సుమారు 3 వేల నుంచి 4 వేల మంది వరకూ పూర్వ విద్యార్థులు వస్తారని అంచనా వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమాల నిర్వహణ ఏర్పాట్లు వంటి విషయాలపై వచ్చే ఆదివారం మరోసారి చర్చిద్దామని చెప్పారు. సమావేశంలో చల్లపల్లి ఉపసర్పంచ్ ముమ్మనేని రాజకుమార్(నాని), రిటైర్డ్ ఆర్డీవో నాదెళ్ల శివరామకృష్ణ, కోనేరు కరుణాకరరావు, యార్లగడ్డ శ్రీనివాసరావు, మోర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

‘కోడ్’ పట్టని అధికారులు!

గూడురు వద్ద జాతీయ రహదారి వెంట కూటమి నేతల భారీ ఫ్లెక్సీలు

గూడూరు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో కొన్నిచోట్ల రాజకీయ నేతల ఫ్లెక్సీలు రహదారుల వెంట కనిపిస్తున్నాయి. మచిలీపట్నం-విజయవాడ జాతీయ రహదారి వెంబడి మండల కేంద్రమైన గూడూరుతో పాటు తరకటూరు వంటి ప్రధాన కూడళ్లలో అధికార పార్టీకి చెందిన నాయకులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు అలానే ఉన్నాయి. ఇటువైపు కలెక్టర్, జేసీ వంటి వారు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. అధికారులు స్పందించి ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాల్సి ఉంది.



గూడూరు ప్రధాన కూడలిలో జనసేన నాయకుల ఫ్లెక్సీ



విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై...

భక్తజన కోలాహలం



మోపిదేవి ఆలయంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దర్శనం కోసం వేచియున్న భక్తులు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. డీసీ దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆధ్వర్యంలో అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అన్నప్రసాదం.. క్యూలో భక్తులు

బ్రహ్మోత్సవాలకు హంసలదీవి ముస్తాబు

నేటి నుంచి వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు

కోడూరు: హంసలదీవి క్షేత్రానికి బ్రహ్మోత్సవ శోభ వచ్చింది. కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు వేణుగోపాల స్వామిగా, మురళీకృష్ణుడుగా చిదానంద అవతార తత్త్వాన్ని ప్రకటించిన హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి స్వామివార్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దేశంలోని 56 వైష్ణవ ఆలయాలను దేవతలే నిర్మించారని పురాణాలు చెబుతుండగా, అందులో హంసలదీవి క్షేత్రం కూడా ఉంది. అంతటి మహిమాన్వితమైన క్షేత్రంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించడానికి శృంగేరీ పీఠం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా మాఘ శుద్ధ త్రయోదశి నుంచి బహుళ పాడ్యమి వరకు ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు నిర్వహించడం అనాదిగా వస్తోంది. 25 ఏళ్ల నుంచి విజయవాడకు చెందిన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం, దేవదాయ శాఖ ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు జరగ్గా, రెండేళ్ల నుంచి శృంగేరీ పీఠం పర్యవేక్షణలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

ఉత్సవ శోభ

బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వేణుగోపాలుడి ఆలయాన్ని ముస్తాబు చేశారు. గతంలో సుమారు రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు జరిగాయి. ఆలయ ప్రధాన గోపురాలతో పాటు రాజగోపురం, కల్యాణవేదికను రంగులతో అలంకరించారు. ఆలయ గోడలకు మొత్తం త్రీడీ రంగులు వేశారు. ఆలయ ముందు భాగంలో నూతన ఆఫీస్ రూంను నిర్మించారు. వెనుకభాగంలో వాహనశాలతో పాటు భక్తులు నిద్రించడానికి గదులు ఏర్పాటు చేశారు. ధ్వజస్తంభం, ఆంజనేయ మండపానికి నూతన సొబగులద్దారు. ఆలయం పక్కనే ఉన్న చెరువును కోనేరుగా అభివృద్ధి చేశారు. ఆలయానికి నాలుగు వైపులా సుమారు రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణాలను చేపట్టారు. ఆలయ ప్రాంగణమంతా విద్యుత్‌దీపాలతో ముస్తాబు జరిగింది. భక్తులకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకున్నట్లు ఆలయ ధర్మాధికారి, టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని తెలిపారు. ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని చెప్పారు.



హంసలదీవి వేణుగోపాలుడి ఆలయ రాజగోపురం



దేవతలే నిర్మించారని చెప్పబడే ఆలయం



వేణుగోపాలుడి మూలమూర్తి

కనులపండువగా నగరోత్సవం



కోడూరు: ఉల్లిపాలెంలోని శ్రీగోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణస్వామి నగరోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. భీష్మ ఏకాదశిని పురస్కరించుకొని రాష్ట్ర గోదా విష్ణుసహస్ర నామ పరివార్.. భక్తబృందాల ఆధ్వర్యంలో శనివారం ప్రారంభమైన విష్ణు సహస్ర నామ పారాయణ ఏకాహం ఆదివారం ఉదయం 10గంటలకు ముగిసింది. అష్టాక్షరీ పీఠాధాపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ, బృందావన స్వామిజీలు శ్రీమన్నారాయణుడి చిత్రపటానికి హారతులిచ్చి తులసీదళాలతో పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవమూర్తుల నగరోత్సవాన్ని జరిపారు. అష్టాక్షరీ స్వామీజీ మాఘమాసం విశిష్టతను భక్తులనుద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు.